క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి సహకారం



ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత అప్పలనాయుడు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం గ్రామానికి చెందిన గౌరీశంకర్ ట్రేడర్స్ యజమాని ముల్లు అప్పలనాయుడు ఆర్థిక సహాయం చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు చీపురుపల్లి పట్టణంలో మంగళవారం రూ.50,116 నగదును దాత అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్ ధనూకా, గొల్లస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సచివాలయ, రైతుసేవా కేంద్రం భవనాల సముదాయం వద్ద నిర్మించిన రక్షణగోడను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీరాజ్ నిధులతో మండలంలోని అంబటివలసలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు మంగళవారం పరిశీలించారు. సచివాలయ భవనం,రైతు సేవా కేంద్రాల భవనం వద్ద నిర్మించిన రక్షణగోడతో పాటు, గ్రామంలో చేపట్టిన సిమెంట్‌రోడ్డు పనులను పరిశీలించారు. పనులకు ఎంత ఖర్చు చేశారు, నాణ్యతా ప్రమాణాలపై సచివాలయ కార్యదర్శితో పాటు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆరా తీశారు.

రికార్డుల గది పరిశీలన



రికార్డుల గదిని పరిశీలిస్తున్న ఆర్డీఓ శాంతి

గుర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డుల గదిని చీపురుపల్లి ఆర్డీఓ బి.శాంతి మంగళవారం పరిశీలించారు. రికార్డులన్నింటినీ భద్రంగా ఉంచాలని తహసీల్దార్ రమాదేవికి ఆదేశించారు. మండలంలోని 42 గ్రామాలకు సంబంధించిన ఎఫ్‌సీఓలు, ఎఫ్‌ఎంబీలు, మ్యుటేషన్ పత్రాలను వరుసక్రమంలో ఉంచాలని సూచించారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

బొండపల్లి: స్థానిక జాతీయ రహదారి–26పై ఎస్‌ఐ కె.లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల పత్రాలు, వాహన చోదకుల లైసెన్స్‌లు పరిశీలించారు.హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు బైక్‌లు వల్లే జరుగుతున్నాయని, హెల్మెట్ ధరించకపోవడం వల్లే ఈ ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. హెల్మెట్ ధరించ కుంటే జరిమానాతో పాటు, జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. మైనర్లుకు బైక్‌లు ఇస్తే సంబంధిత బైకు యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



భద్రకాళీదేవిగా పూజలందుకుంటున్న రాజరాజేశ్వరీదేవి

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అమ్మవారు భద్రకాళికాదేవిగా దర్శనమిచ్చింది.గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఘటాలు,ప్రభలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు



జామి: భీమసింగిలో ట్రేలలో పెంచుతున్న వరినారును పరిశీలిస్తున్న జేడీ రామారావు



వేపాడ: చిట్టివానిపాలెంలో వరుసక్రమంలో వరినాట్లు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు



జామి: సిరికిపాలెం వరి నారును బీజామృతంతో శుద్ధిచేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఆర్టీఓ హేమసుందర్



గజపతినగరం రూరల్: తుమ్మికాపల్లిలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

జామి: రైతులు సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు రైతులకు సూచించారు. భీమసింగి గ్రామంలో రైతు జొన్నాడ వాసు ట్రేలలో పెంచుతున్న వరినారును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వరినారు లేత దశలో ఉన్నప్పుడే యంత్రం సహాయంతో నాట్లు వేసుకోవాలని చెప్పారు.యంత్రంతో వరుస క్రమంలో, సమదూరంలో నాట్లు వేసుకోవచ్చని, ఇలా చేయడం వల్ల ఎక్కువ పిలకలు వస్తాయని, తద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆయన వెంట ఏడీఏ ఎల్.విజయ, ఏఓ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లైన్ సోయింగ్ విధానంపై అవగాహన

వేపాడ: లైన్ సోయింగ్ విధానంలో వరినాట్లు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ ఆర్టీఓ హేమసుందర్ అన్నారు. చిట్టివానిపాలెం గ్రామంలో సబల స్వచ్ఛందసంస్థ బృందం, ఏపీసీఎన్ఎఫ్, సుస్థిర వ్యవసాయ కేంద్రం సిబ్బంది సంయుక్తంగా లైన్‌సోయింగ్ పద్ధతిలో వరినాట్లు వేసే విధానంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆర్టీఓ మాట్లాడుతూ లైన్‌సోయింగ్ విధానంలో వరినాట్లు వేయడం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగులుతుందని, పంటను చీడపీడలు ఆశించవని చెప్పారు. నాట్లు వేసే ముందు వరినారు చిగుర్లు కత్తిరించాలని, మొదళ్లను బీజామృతంతో విత్తశుద్ధి చేసుకోవాలని వివరించారు. ఇలా చేయడం వల్ల కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. అలాగే పంటలో కలుపుతీతకు అవసరమయ్యే కోనో వీడర్ పరికరాలను రైతులకు సబల సంస్థ అందిస్తోందని తెలిపారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శ్రావణి, రీజనల్ కో–ఆర్డినేటర్ వెంకటరావు, క్లస్టర్ కో– ఆర్డినేటర్ వీరభద్రస్వామి,ఎంటీఎల్ వసంత, ఎంటీ ఈశ్వరరావు, ఐసీఆర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీజామృతంతో శుద్ధి చేసుకోవాలి

జామి: వరి పంటను తెగుళ్లు ఆశించకుండా ఉండేందుకు నాట్లు వేసే సమయంలో వరి నారును బీజామృతంతో శుద్ధిచేసుకోవాలని ఆర్టీఓ హేమసుందర్ తెలిపారు. సిరికిపాలెం గ్రామంలో దమ్ములు చేస్తున్న రైతులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. వరుస క్రమంలో నాట్లు వేసుకోవాలని సూచించారు. ఎంటీ కోటిబాబు, ఐసీఆర్పీలు రామారావు, సరోజిని,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

లోతుగా నాటొద్దు

గజపతినగరం రూరల్: వరి నాట్లు వేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు పాటించాలని, నారును లోతుగా నాటితే పిలకలు ఆలస్యంగా వస్తాయని, పైపైన నాటుకోవాలని ఏడీఏ మహరాజన్ సూచించారు. తుమ్మికాపల్లి గ్రామంలో రైతులకు వరినాట్లు వేసే విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. చదరపు మీటరుకు 33 కుదుళ్లు ఉండేలా నాటుకోవాలన్నారు. నీటి,ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు.ఏఓ ధనలక్ష్మి, వ్యవసాయశాఖ సహాయకులు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం హిందూస్తాన్ రిపబ్లిక్ ఇన్ అసోషియేషన్ స్థాపించిన చంద్రశేఖర్ ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, విద్యార్థిదశలో సహాయ నిరాకరణలో పాల్గొని అరెస్టయ్యారని అన్నారు. ఆయన్ని మెజిస్ట్రేట్ తన గురించి అడిగితే తన తండ్రి పేరు స్వాతంత్య్రం అని, తన పేరు ఆజాద్ అని బదులిచ్చాడన్నారు. దేశానికి స్వాతంత్య్రం సాధించడం కోసం ప్రాణాలు అర్పించిన మహావ్యక్తి ఆజాద్ అని అన్నారు. హిస్టరీ లెక్చరర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రశేఖర్ చరిత్ర నేటి యువతకు ఒక పాఠం వంటిదన్నా రు. దేశంలో పెచ్చరిల్లుతున్న ఉగ్రవాదం, హింస, దాడులు, అత్యాచారాలు, హత్యల వల్ల చంద్రశేఖర్ లాంటి మహనీయులు చేసిన ప్రాణత్యాగం వృథా అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి చదురుగుడి, వనంగుడిలలో ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావి చెట్ల వద్ద దీపారాధనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.



చదురుగుడిలో ప్రత్యేక పూల అలంకరణలో పైడితల్లి అమ్మవారు

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి



డీలర్లతో సమావేశమైన తహసీల్దార్ సుదర్శన్

దత్తిరాజేరు: గ్రామాల్లో రేషన్ డిపోల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ సుదర్శన్‌రావు రేషన్ డీలర్లకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయంలో రేషన్ డీలర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల తూకంలో తేడా రాకూడదన్నారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎస్‌డీటీ రత్నం పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

కొత్తవలస: అర్హత గల కౌలు రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు బ్యాంకు అధికారులను కోరారు. కంటకాపల్లి గ్రామంలోని స్టేట్ బ్యాంక్‌ను మంగళవా రం ఆయన సందర్శించారు. బ్యాంకు సిబ్బందితో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలను తక్షణమే మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు కంటకాపల్లి గ్రామంలో వరి నారుమడులను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. వరినారు ఆరోగ్యంగా ఉండాలన్నా, మరింత ఎదగాలి అంటే నానో డీఏపీ ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

నగరంలో డెంగీ కలకలం

- ఒకే రోజు బయటపడ్డ మూడు కేసులు
- అప్రమత్తమైన కార్పొరేషన్ యంత్రాంగం
- కేసులు నమోదైన ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్
- పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం



పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: జిల్లా కేంద్రంలో డెంగీ వ్యాధి కలకలం రేపుతుంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒకే రోజు మూడు కేసులు బయట పడటంతో కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలోని కాటవీధి, కేఎల్‌పురం ప్రాంతానికి చెందిన ఇద్దరు చిన్నారులతో పాటు జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన మరొకరికి డెంగీ సోకినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వ్యాధి సోకిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా వ్యాధి సోకిన వారు విశాఖలోని ఓ విద్యా సంస్థకు చెందిన హాస్టల్‌లో ఉంటున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. నగరంలో అటువంటి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు ప్రజారోగ్య అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

కమిషనర్ పర్యటన

కాలానుగుణ వ్యాధులకు దోమలే ప్రధాన కారణమని, వాటి నియంత్రణ బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు పేర్కొన్నారు. డెంగీ కేసు నమోదైన కాటవీధి, కేఎల్‌పురం, జొన్నగుడ్డి తదితర ప్రాంతాలలో పర్యటించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లో దోమలు వృద్ధి కాకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలను కోరారు. నిరంతరం దోమల నియంత్రణకు తాము అన్ని విధాలా చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రజలు కూడా సహకరించి దోమల వృద్ధి కేంద్రాలు లేకుండా చూడాలన్నారు. ప్రధానంగా నీటి నిల్వలు లేకుండా ప్రతిరోజు శుభ్రపరచుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలలో ఉన్న టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అలాగే కాటవీధి పాఠశాలకు చేరుకుని విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే దోమలు వల్ల సంక్రమించే రోగాల గురించి తెలుసుకోవాలన్నారు. నేటి నుంచి విద్యార్థులు తమ ఇళ్లల్లో నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రపరచుకోవాలని సూచించారు. నిరుపయోగంగా పడి ఉన్న టైర్లలో, కొబ్బరి చిప్పలలో, గుంతలలో, ఎయిర్ కూలర్లలో ఎక్కువగా నీరు నిల్వ ఉండిపోతుందని అవే దోమలకు వృద్ధి కేంద్రాలుగా నిలుస్తున్నాయని వివరించారు. వారంలో ఒకరోజు డ్రై డే పాటించాలని అయితే ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ప్రతిరోజు వ్యర్థనీటిని ప్రక్షాళన చేయాలని చెప్పారు. దోమలు వృద్ధి కాకుండా తాము కుంటలలో, చెరువులలో ఇప్పటికే ఆయిల్ బాల్స్ వేసామని, అలాగే యాంటీ లార్వా ఆపరేషన్‌ను ముమ్మరం చేసామని చెప్పారు. అనేక ప్రాంతాలలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు తప్పనిసరిగా వాడుకోవాలని అన్నారు. చిన్నపిల్లల పట్ల మరింత జాగ్రత్తగా ఉండి దోమలు దరిచేరకుండా చూడాలన్నారు. ఆయన వెంట పారిశుద్ధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు ఉన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



కొత్తవలస: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర



గుర్ల: విద్యార్థులకు అవగాహనకల్పిస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

కొత్తవలస: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల జోలికిపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర సూచించా రు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వ ర్యంలో స్థానిక కోటపాడు రోడ్డులోని ప్రగతి డిగ్రీ కళాశాలలో మంగ ళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అతిథిగా హాజ రైన జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత భవిష్యత్ ఉంటుం దని, చెడు వ్యసనాలకు బానిసగా మారితే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. మాదక ద్రవ్యా లు వినియోగించినా, రవాణా చేసినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధన కోసం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. న్యాయవాదులు శ్రీనివాసరావు, మహేష్, శ్రీరామ్మూర్తి, ఏఎస్‌ఐ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గుర్ల: విద్యార్థులు చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని ఎస్‌ఐ భాస్కరరావు సూచించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థా లపై మండలంలోని కెల్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యుక్త వయస్సులో మత్తుపదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ నాశనం కావడంతో పాటు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన



మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలిస్తున్న గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఫ్లోరెన్స్

వేపాడ: స్థానిక బాలికల గురుకుల పాఠశాలను గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త టి.ఎం.ఫ్లోరెన్స్ మంగళవారం సందర్శించారు. జాతీయ విద్యా విధా నం(ఎన్‌ఈపీ– 2020) ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో శిక్షా సప్తాహ్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం భోజనశాలను సందర్శించి మెనూ ప్రకారం వంటలు చేశారా లేదా పరిశీలించి, వంటకాలను రుచిచూశారు. వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వంట చేసే ప్రదేశంలో పరిశుభ్రత పాటించాలని, నాణ్య మైన రుచికర భోజనం విద్యార్థినులకు అందించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయినులతో సమావేశమై పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ ఉషారాణి ఉన్నారు.

జగన్ సంస్కరణలు చరిత్రలో నిలిచిపోతాయి



చీపురుపల్లి: రామాంజనేయకాలనీ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్‌లు, షూస్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ విద్యావ్యవస్థలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలు, విప్ల వాత్మక మార్పులు చరిత్రలో నిలిచిపోతాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. పట్ట ణంలోని రామాంజనే యకాలనీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన బ్యాగ్‌లు, షూస్, బెల్టులు, పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా తీర్చిదిద్దారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్‌లో ప్రపంచంతో పోటీ పడే విధంగా ఇంగ్లిష్ మీడియంను అమల్లోకి తీసుకొచ్చారని, అలాగే మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. కంప్యూటర్ ప్రపంచంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీపడే విధంగా చీపురుపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాల లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ల్యాబ్‌ను గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆ కార్యక్రమాలన్నీ ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు పతివాడ రాజారావు, గిరిడి రాందాసు, కోరుకొండ దాలయ్య, ముజిబీర్ మహ్మద్, కరణం ఆది, ఇప్పిలి కృష్ణ, మీసాల పోలీస్, కర్రోతు ప్రసాద్, మీసాల సీతారాం, వెంపడాపు నీలకంఠం, ప్రభాత్, యల్లంటి శివ, రౌతు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.




గుర్ల: పాలవలసలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ ప్రమీల, నాయకులు

సద్వినియోగం చేసుకోవాలి

గుర్ల: ప్రభుత్వం కల్పించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగించుకుని బాగా చదువుకోవాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల సూచించారు. మండలంలోని పాలవలస ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. స్థానిక నాయకులు బూర్లె శ్రీనివాసరావు, వల్లూరి రాము, గేదెల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన హోంగార్డుల అసోసియేషన్ సభ్యులు

విజయనగరం క్రైమ్: నూతనంగా జిల్లాకు వచ్చిన ఎస్పీ వకుల్ జిందాల్‌ను జిల్లా హోంగార్డుల అసోసియేషన్, కోఆపరేటివ్ సొసైటీ తరఫున ఆ సంఘ సభ్యులు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హోంగార్డుల అసోసియేషన్ అధ్యక్షుడు పడగల బంగార్రాజు ఆధ్వర్యంలో హోంగార్డులు ఎదుర్కొంటున్న తమ సమస్యల్ని విన్నవించారు. అనంతరం ఎస్పీ, హోంగార్డుల సమస్యలు, కోఆపరేటివ్ సొసైటీ సమస్యల మీద త్వరలో చర్చించి చర్యలు తీసుకుంటామని, తగిన సూచనలు, సలహాలిచ్చి, హోంగార్డులు అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో హోంగార్డుల జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పి.సుశీల, సభ్యులు, డైరెక్టర్‌లు మహేష్, పతివాడ శంకరరావు, రమణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ వకుల్ జిందాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న హోంగార్డుల అసోసియేషన్ అధ్యక్షుడు తదితరులు

సెంచూరియన్‌ను సందర్శించిన విద్యా సంస్థల ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని విశాఖకు చెందిన ప్రముఖ విద్యా సంస్థల ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. సెంచూరియన్‌లో ఉన్న సౌకర్యాలు గురించి వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రయోగశాలలు, జైరోప్లేన్, ఆప్టోమెట్రీ, రేడియాలజీ, ఏఆర్, వీఆర్ ల్యాబ్, ఫారెన్సిక్ ల్యాబ్, తదితర వాటిని సందర్శించారు. కార్యక్రమంలో సిల్వర్ ఓక్ స్కూల్ ప్రతినిధులు ఈశ్వరరావు, గిరీష్, గౌరీ పీజీ కళాశాల కరెస్పాండెంట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.